బాదేపల్లి బస్టాండ్‌కు పూర్వవైభవం

- కల్వకుర్తి–మహబూబ్‌నగర్ బస్సుల రాకపోకలు
- వనపర్తి, నాగర్‌కర్నూల్ డిపోలవి వచ్చేలా చూడాలంటున్న ప్రజలు

జడ్చర్ల టౌన్‌: తొమ్మిది దశాబ్దాల చరిత్ర కలిగిన బాదేపల్లి బస్టాండ్‌కు పూర్వవైభవం సంగతేమో.. కాని ప్రస్తుతానికి కల్వకుర్తి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే బస్సులు మాత్రమే వచ్చి వెళ్తున్నాయి. కల్వకుర్తి బస్సులతోపాటు వనపర్తి, నాగర్‌కర్నూలు బస్సులు సైతం వచ్చేలా చూడాలని పాతబజార్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. 1935లో రైల్వేస్టేషన్ ఏర్పాటైన సమయంలోనే ప్రయాణికుల సౌకర్యార్థం బాదేపల్లి బస్టాండ్ ప్రారంభమైంది. నాటినుంచి దాదాపు ఏడుదశాబ్దాలపాటు ప్రయాణికులకు సేవలందించిన బస్టాండ్ రెండు దశాబ్దాలుగా బస్సుల రాకపోకలు తగ్గడం, ప్రయాణికులు రాకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. కొన్నేళ్లపాటు కల్వకుర్తి, మహబూబ్‌నగర్ బస్సులు వచ్చి వెళ్లేవి. ప్రస్తుత స్టేషన్‌రోడ్డులో డివైడర్ల నిర్మించడం, రైల్వేగేట్ సమస్యల కారణంగా 15ఏళ్ల నుంచి బస్సుల రాకపోకలు పూర్తిగా తగ్గిపోయాయి. కేవలం మహబూబ్‌నగర్ బస్సులు మాత్రమే వచ్చి వెళ్లేవి. ఐదేళ్లుగా అవికూడా నిలిచిపోయాయి. బస్టాండ్ ఆవరణ పిల్లలు ఆటస్థలంగా మార్చుకోగా కొందరు ప్రైవేట్ వాహనాలు నిలిపేందుకు వినియోగించేవారు.

ఎమ్మెల్యే హామీతో ఆశలు

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాను గెలిస్తే బస్టాండ్‌కు పూర్వవైభవం తీసుకొస్తానని అనిరుధ్ రెడ్డి హామీ ఇవ్వడం.. ఆయన విజయం సాధించడంతో పాతబజార్ వాసుల్లో ఆశలు చిగురించాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో బస్టాండ్‌కు బస్సులు రావాలన్న డిమాండ్లు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి బస్టాండ్‌కు పూర్వవైభవం తీసుకురావాలని విన్నవించారు.

ఆర్టీసీ అధికారుల పరిశీలన

ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు నెలరోజుల క్రితం ఆర్టీసీ అధికారులు ఈ ప్రాంతం, బస్టాండ్‌ను సందర్శించి వెళ్లారు. రోడ్డు డిజైన్ పరిశీలించినవారు బస్టాండ్‌కు బస్సుల రాకపోకలపై నివేదికను సిద్ధం చేశారు. కేవలం కల్వకుర్తి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే బస్సులు మాత్రమే బస్టాండ్‌కు వస్తాయని నిర్ధారించారు. మహబూబ్‌నగర్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్లే బస్సులు రైల్వే బ్రిడ్జ్ దాటి యూటర్న్ తీసుకురావాల్సి ఉన్నందున సాధ్యంకాదని నిర్ణయించారు. ఈ మేరకు 15రోజులుగా కల్వకుర్తి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే బస్సులు బస్టాండ్‌కు రాకపోకలు సాగిస్తున్నాయి. వనపర్తి, నాగర్‌కర్నూలు, కొల్లాపూర్ బస్సులు రావాలని ప్రస్తుతం కల్వకుర్తి–మహబూబ్‌నగర్ బస్సులు వస్తున్నట్లుగా వనపర్తి, నాగర్‌కర్నూలు, కొల్లాపూర్ ప్రాంతాలకు వెళ్లే బస్సులు బస్టాండ్‌కు వచ్చి వెళ్లాలని పాతబజార్ వాసులు కోరుతున్నారు. పైడిపోల నుంచి వచ్చే బస్సులు హైదరాబాద్ వెళ్లే క్రమంలో బస్టాండ్‌కు వచ్చి వెళ్లేలా చూడాలని తద్వారా కొంతైనా మేలు కలుగుతుందని పాతబజార్ వాసులు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే బస్సుల సంగతి తర్వాత చూద్దామన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.


బాదేపల్లి బస్టాండ్ (ముఖచిత్రం)


బస్టాండ్‌కు వచ్చి వెళ్తున్న బస్సు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



చాలాకాలం తర్వాత కల్వకుర్తి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే బస్సులు బస్టాండ్‌కు వస్తున్నాయి. అందుకు కృషిచేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు. అలాగే వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులు అన్ని వచ్చేలా చూడాలి. కొన్ని బస్సులు వస్తున్నందుకు సంతోషం.. అన్నివచ్చేలా చూస్తే పాతబజార్ వాసులకు మేలు కలుగుతుంది.

– యాదగిరి, పాతబజార్

బస్సులు వస్తేనే మేలు



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. అలాగే బాదేపల్లి బస్టాండ్‌కు అన్ని బస్సులు వచ్చేలా చేస్తే మా అందరికీ ఎంతో మేలు కలుగుతుంది. ఇంతకుముందు బస్సు ఎక్కాలంటే సిగ్నల్‌గడ్డ వరకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కొంత నయమైంది. అలాగే మిగిలిన బస్సులు వచ్చేలా చేస్తే ఎంతో బాగుంటది.

– కామాక్షమ్మ, పాతబజార్

క్లుప్తంగా

‘ప్రజాస్వామంలో దాడులకు తావులేదు’

జడ్చర్ల: ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన జడ్చర్లలో మీడియాతో మాట్లాడుతూ.. మేడిపల్లిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై తెలంగాణ జాగృతి కార్యకర్తలు దాడులు చేసి విధ్వంసం చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాజకీయపరంగా ఇబ్బందులు వస్తే చట్టప్రకారం ముందుకు వెళ్లాలని, న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించాలని తెలిపారు. దాడుల సంస్కృతి ఎంతమాత్రం మంచిది కాదన్నారు.

నేడు మిడ్జిల్‌కు ఎంపీ డీకే అరుణ

మిడ్జిల్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ సోమవారం ఉదయం మిడ్జిల్ మండలానికి వస్తున్నారని బీజేపీ మండలాధ్యక్షుడు నరేశ్‌నాయక్ తెలిపారు. ఉదయం 11గంటలకు మిడ్జిల్‌లో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారని, అనంతరం మండల కేంద్రంలోని ఎంపీఎస్ గార్డెన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్వహించే ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల బీజేపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

పాలమూరు వాసికి మహాత్మా చరఖా అవార్డు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు వాసి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ–జ్ఞాన ప్రతిష్ట జిల్లా అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్‌కు మహాత్మా చరఖా అవార్డు దక్కింది. ఈ మేరకు ఆదివారం గాంధీ భవన్‌లోని ప్రకాశం హాలులో జరిగిన సుస్థిర విజ్ఞాన సదస్సులో ఆయనకు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

రైతులు జాగ్రత్తగా ఉండాలి



నవాబుపేట: రైతుభరోసా పేరుతో రైతుల ఫోన్లకు రకరకాల మెసేజ్‌లు, డాటా లింక్‌లు వస్తాయని వాటిని పొరపాటున కూడా ఓపెన్ చేయకూడదని ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. లింక్‌లు ఓపెన్ చేస్తే ఖాతాల్లో ఉన్న నగదు స్వాహా అవుతుందని సూచించారు. రైతులు ఎలాంటి కొత్త వాటిని ఫోన్లలో అప్లోడ్ చేయవద్దని తెలిపారు. వాట్సప్‌లో ఏదైనా వస్తే వెంటనే దాన్ని డెలీట్ చేయాలని సూచించారు. పొరపాటున ఖాతాల నుంచి డబ్బులు మాయమైతే వెంటనే సైబర్ క్రైం 1930కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వివరించారు.

భక్తిశ్రద్ధలతో ఆషాడం బోనాలు

నవాబుపేట: మండలంలోని తీగలపల్లిలో ఆదివారం ఆషాడం బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను అలంకరించుకొని ఊరేగింపుగా వెళ్లి మైసమ్మ, పోచమ్మ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. కార్యక్రమంలో జంగయ్య, చెన్నప్ప, నారాయణ, ఆశన్న, భీమయ్య, బాలకిష్టయ్య, నర్సింహులు, కృష్ణయ్య, రాజు, బాలయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

గ్రామ కమిటీల ఎన్నిక

మహమ్మదాబాద్: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం నంచర్ల, మంగంపేట్, చౌదర్‌పల్లి, ఎన్కిచెరువుతండా, చిన్నాయపల్లి గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ప్రతి కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

సమాజ సేవల్లో లయన్స్ క్లబ్ భాగస్వామ్యం



స్టేషన్ మహబూబ్‌నగర్: సమాజ సేవల్లో లయన్స్ క్లబ్‌లు భాగస్వామ్య అవుతున్నాయని పలువురు ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాత్రి లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్, లయన్స్ క్లబ్ సుప్రభాత్ ప్రమాణాస్వీకార కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ మహబూబ్‌నగర్ అధ్యక్షుడిగా సుదర్శన్‌యాదవ్, కార్యదర్శిగా చెన్నయ్య, కోశాధికారిగా నాగరాజు, సుప్రభాత్ అధ్యక్షుడిగా రుద్రోజీరావు, కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా వినోద్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు నటరాజ్, డాక్టర్ శశికాంత్, అశోక్‌కుమార్ యాదవ్, గోవర్ధన్, రాములు, జనార్దన్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘కుల నిర్మూలన చట్టాలు అమలు చేయాలి’


మాట్లాడుతున్న కేపీఎన్‌పీఎస్ అఖిల భారత కన్వీనర్ బండారి లక్ష్మయ్య

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కుల నిర్మూలన చట్టాలను అమలు చేయాలని హెచ్‌సీయూ ప్రొఫెసర్ కె.వై.రత్నం అన్నారు. ఆదివారం తెలంగాణ చౌరస్తాలోని రెడ్‌క్రాస్ సొసైటీ హాల్‌లో కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి (కేపీఎన్‌పీఎస్) రాష్ట్ర రెండో మహా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో రాజ్యాంగం కంటే కులానికే ఎక్కువ ప్రాధన్యమిస్తున్నారని ఆరోపించారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కుల నిర్మూలన, సమసమాజం ఏర్పాటు విద్యతోనే సాధ్యమన్నారు. అనంతరం రాష్ట్ర కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గన్నారపు సరోజన (వరంగల్), ప్రధాన కార్యదర్శిగా ఈరపాగ గోవిందు (వనపర్తి), కోశాధికారిగా ఎర్ర మోహనకృష్ణ (కేవీ రంగారెడ్డి)తోపాటు ఇతర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కేపీఎన్‌పీఎస్ అఖిల భారత కన్వీనర్ బండారి లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, ఓయూ ప్రొఫెసర్లు వెంకటదాసు శ్రీశోభ, స్వామిదాసు, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, కవి, రచయిత ఇంద్రవెల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు రుసుం వసూలు చేస్తే చర్యలు

మహబూబ్‌నగర్ రూరల్: వినియోగదారుల నుంచి మీ సేవ నిర్వాహకులు అదనపు రుసుం వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మహబూబ్‌నగర్ అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్ కేసిరెడ్డి హెచ్చరించారు. ఆదివారం సాక్షితో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో 40 మీసేవ కేంద్రాలు ఉన్నాయని, వినియోగదారులు తమ దరఖాస్తుల ప్రాసీడింగ్ సమయంలో మీసేవ యజమానులకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుం కన్నా అదనపు రుసుం వసూలు చేస్తున్నారని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలోని మీసేవ కేంద్రాలపై ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే మీసేవ కేంద్ర యజమానులు, నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. తక్షణమే అదనపు రుసుం వసూలు నిలిపివేయాలని ఆదేశించారు.

ప్రతిభ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం


విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

మిడ్జిల్: ఐద్వా జిల్లా మాజీ అధ్యక్షురాలు అరుణ వర్ధంతి సందర్భంగా మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందజేశారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.10వేలు, ద్వితీయ స్థానంలో ఉన్నవారికి రూ.5వేలు, పదో తరగతిలో మొదటి స్థానంలో ఉన్నవారికి రూ.5వేలు, ద్వితీయ స్థానంలో ఉన్నవారికి రూ.3వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ మాట్లాడుతూ.. కామ్రేడ్ అరుణ మన మధ్యలో లేకపోయిన ఆమె జ్ఞాపకాలు పదిలంగా ఉన్నాయన్నారు. అనంతరం నివాళులర్పించి ఆమె సేవలను కొనియడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు రాంరెడ్డి, కురుమూర్తి, కుర్మయ్య, మోహన్, భరత్, జంగయ్య, సృజన్, సుదుప్తి, నర్సింహస్వామి, తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ సంబరాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు క్యాబినెట్‌లో ఆమోదించడంపై కాంగ్రెస్ పార్టీ ఓబీసీ పట్టణ అధ్యక్షుడు బండి మల్లేశ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేదరర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులకు ధన్యవాదాలు తెలుపుతూ వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వసంత, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు అజ్మత్‌అలీ, రాఘవేందర్‌రాజు, సాయిబాబా, అవేజ్, రాములుయాదవ్, అంజనేయులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీచండీ కుబేర పాశుపత యాగం

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ధూపదీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొల్తా బాద్ వాసుదేవశర్మ, అన్నవజ్జుల ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కాచిగూడ తుల్జాభవానీ మందిరంలో ఈనెల 14నుంచి 16 వరకు పంచకుండాత్మక శ్రీ చండీ కుబేర పాశుపత యాగం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆ దివారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలమై, పాడిపంటలతో విరాజిల్లాలని, రాష్ట్రంలోని ప్రజలదరూ సుఖసంతోషాలతో ఉండాలని,రాష్ట్రం దేశంలోనే మంచిపేరు ప్రఖ్యాతలు సాధించాలనే గొప్ప సంకల్పంతో ఈ యాగాన్ని తలపెట్టినట్లు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ యాగంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లోని ధూప, దీప నై వేద్య అర్చకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ధూపదీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడు రవికుమార్, జిల్లా అధ్యక్షుడు మహేశ్, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

నవాబుపేట: మండలంలోని మైసమ్మ రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. ఆదివారం ఉదండపూర్ ప్రాజెక్టులో కృత్రిమ ఇసుక తయారు చేసుకుని టిప్పర్‌లో జిల్లా కేంద్రానికి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పోలీసులను చూసి టిప్పర్ డ్రైవర్ పారిపోతుండగా అతన్ని పట్టుకుని విచారించినట్లు పేర్కొన్నారు. టిప్పర్ డ్రైవర్ దొరమోని సతీశ్, యజమాని తిరుమల వెంకటేశ్‌పై కేసునమోదు చేసి, టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

‘గోరింటాకు అందరి సంప్రదాయం’



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గోరింటాకు పెట్టుకోవడం అన్ని మతాలకు సంప్రదాయంగా మారిందని వీర శైవ లింగాయత్ మహిళా నాయకురాలు నాగశ్రీ, బునేటి ఉషారాణి అన్నారు. ఆషాఢ మాసం పు రస్కరించుకుని ఆదివారం స్థానిక వీరన్నపేటలోని విశ్వలింగాయత్ కమ్యూనిటీ హాల్‌లో గోరింటాకు మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ గోరింటాకుతో ఆరోగ్యం, అందం ,ఆకర్షణ, మనోవికాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు కొండా రాజేశ్వరి, వైశాలి, సౌమ్య, శెట్టి సుమిత్ర, ముక్తా భాగ్యం, పోకల నీలమ్మ, శ్రీదేవి, సుజాత పాల్గొన్నారు.

పర్వతాపూరు.. భక్తులహోరు



నవాబుపేట: మైసమ్మ దేవత నామస్మరణతో అడవి మొత్తం మారుమోగింది. ఆదివారం మండలంలోని పర్వాతాపూర్ మైసమ్మ ఆలయంలో జనం తండోపతండాలుగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం పైగా ఆషాఢమాసం నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని విందు భోజనాలు చేశారు. దీంతో అడవిలో చెట్ల కింద జనం జాతరలా కనిపించారు.

స్నేహితుల కుటుంబాలకు ఆర్థికసాయం

మహమ్మదాబాద్: మండలంలోని గాధిర్యాల్‌కు చెందిన చాకలి హన్మంతు బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఇటీవల, బోట్లగడ్డతండాకు చెందిన మోహన్‌నాయక్ గతేడాది మృతిచెందారు. వీరితో కలిసి చదువుకున్న 1998–99 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పుట్టాపహాడ్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. రెండు కుటుంబాలకు రూ.75వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో స్నేహితులు రాజశేఖర్, ఆంజనేయులు, శ్రీకాంత్, శ్రీనివాస్ వెంకటేశ్ ఉన్నారు.

తోట మైసమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: తోట మైసమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. ఆషాఢమాసం బోనాలు సందర్భంగా ఆదివారం కుర్హినిశెట్టికాలనీలోని బోనాల ఉత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని తోట మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎన్‌పీ.వెంకటేశ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, గుండా మనోహర్, ఈశ్వరయ్య, రాఘవేందర్, రఘు, సాయికుమార్, భీమరాజు, అశోక్, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరంగంలో అగ్రస్థానంలో ఉండాలి

మహబూబ్‌నగర్ చదువుతోపాటు ప్రతిరంగంలో అగ్రస్థానంలో ఉండాలన్నదే లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మాడ్రన్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన జీఏ.విలియం సన్మాన సభను స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ మహానగరంగా మెల్లమెల్లగా అడుగులు వేస్తుందన్నారు. పీయూలో ఇంజనీరింగ్, లా కళాశాలలు, ఐఐఐటీ కళాశాలను తీసుకురావడంతో తెలంగాణ రాష్ట్ర విద్యా చిత్రటంలో మహబూబ్‌నగర్ ముఖచిత్రం మారిందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, టీజీ పీడీ, పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, పెటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, ఉమామహేశ్వర్‌రెడ్డి, రాంచందర్, నిరంజన్‌యాదవ్, కృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి


మాట్లాడుతున్న రాములు యాదవ్

చిన్నచింతకుంట: బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని బీసీ కులాల ఐక్యవేదిక కన్వీనర్ రాములు డిమాండ్ చేశారు. ఆదివారం చిన్నచింతకుంటలో బీసీకులాల ఐక్యవేదిక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం కల్పిస్తున్నామని చెబుతూ బీసీలను మోసం చేస్తున్నదని, జనగణనతోపాటు కులగణన చేపట్టినంత మాత్రాన బీసీలకు రిజర్వేషన్ల కల్పన పూర్తయినట్లు కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్రం ఆమోదించాలన్నారు. సీఎం రేవంత్ రాష్ట్రంలోని బీసీకులాల నాయకులతో ప్రధానిని కలిసి రిజర్వేషన్ల పక్రియ ఆమోదానికి కృషిచేయాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగంలో అవకాశాలు కల్పించాలన్నారు. ఈనెల 19న కొత్తకోటలో బీసీ కులాల ఐక్యవేదిక రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని బీసీకులాల ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నంబిరాజు, విష్ణువర్ధన్‌గౌడ్, బాలచంద్రుడు, మనోహర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో కింగ్ షోటోకాన్ విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో చెన్న వీరయ్య, మాస్టర్ జహంగీర్‌పాషా ఖాద్రీ

మహబూబ్‌నగర్ క్రీడలు: షాద్‌నగర్‌లో శనివారం జరిగిన సౌతిండియా నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లాకేంద్రానికి చెందిన కింగ్‌షోటోకాన్ కరాటే డూ ఇండియా విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్, సీనియర్ కరాటే మాస్టర్ జహంగీర్‌పాషా ఖాద్రీ తెలిపారు. ఆదివారం స్థానిక మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులను ముఖ్యఅతిథిగా పాల్గొన్న కింగ్‌షోటోకాన్ వైస్ చైర్మన్, మాజీ కౌన్సిలర్ చెన్న వీరయ్య అభినందించారు. జహంగీర్‌పాషా ఖాద్రీ మాట్లాడుతూ ఈ పోటీల్లో సాబేర్‌పాషా బ్రౌన్‌బెల్టు విభాగంలో బంగారు పతకం, గ్రాండ్ చాంపియన్‌షిప్, కలర్ బెల్టులో బాలేషరీఫ్ బంగారు పతకం, గ్రాండ్ చాంపియన్‌షిప్, బాలికల కటాస్ కలర్ బెల్టులో ఆయేషా బేగం గ్రాండ్ చాంపియన్‌షిప్ పొందగా కలర్ బెల్టులో హుమేరా రన్నరప్ సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా ఆయా విభాగాల్లో మారియబేగం, హుమేరాబేగం, హఫ్సాబేగం, ఆయేషాబేగం, ఖిజ్ర, సబా, గుల్‌ఫిషా, వెన్నెల, ఖాసిం, సాబేర్, షరీఫ్, ఫైజాన్ బంగారు పతకాలు, అమాన్ రజత పతకం, జుల్ఫికర్, నిఖిల్, ఖాజ అజీజ్, బిలాల్ ఆజమ్ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. కింగ్‌షోటోకాన్ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

సర్వీసు రోడ్డు.. చూసొక్కో డ్రైవరన్న

- జానంపేటలో ప్రమాదకరంగా సర్వీస్ రోడ్డు
- కల్వర్టుకు రక్షణగోడ నిర్మించాలని గ్రామస్తుల విజ్ఞప్తి


రక్షణ గోడ లేక ప్రమాదకరంగా మారిన కల్వర్టు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని జానంపేట వద్ద జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డుపై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కొన్నాళ్ల కిందట సర్వీస్ రోడ్డుపై బీటీ వేయించారు. పాత పెట్రోల్ పంపు ఎదురుగా రైస్‌మిల్లు పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు వద్ద కల్వర్టుకు ఒకవైపు మాత్రమే రక్షణ గోడ ఉంది. మరోవైపు రక్షణ గోడ నిర్మించలేదు. ఇక్కడ జాతీయ రహదారిపై మూసాపేట వైపునుంచి జానంపేట గ్రామంలోకి సర్వీస్ రోడ్డుపై మళ్లే వాహనాలకు రక్షణ గోడలేని కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. రాత్రివేళ ద్విచక్రవాహనాలు, ఆటోలు కల్వర్టు వద్ద ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. హైవేను దిగివచ్చే సమయంలో డ్రైవర్లు ఏమాత్రం అజాగ్రత్త వహించినా కల్వర్టులో పడిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా రహదారి నిర్వాహకులు స్పందించి కల్వర్టు వద్ద రక్షణ గోడ నిర్మించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


రాజాపూర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాజాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకున్న 1990–91 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 35 ఏళ్ల కిందట కలిసి చదువుకున్న పాఠశాలకు చేరుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ముందుగా పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం గురువులను సన్మానించారు.

‘48’ ఏళ్ల తర్వాత కలుసుకున్నారు

అడ్డాకుల: మూసాపేట మండలం వేములకు చెందిన పూర్వ విద్యార్థులు 48ఏళ్ల తర్వాత మూసాపేటలో కలుసుకున్నారు. వేముల పాఠశాలలో 1977 లో 7వ తరగతి వరకే ఉండగా.. 7వ తరగతి కలిసి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకొని యోగక్షేమాలను తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు. తాము చదువుకున్న పాఠశాల అభ్యున్నతికి కృషి చేయాలని చర్చించుకున్నారు.


మూసాపేటలో వేముల పూర్వ విద్యార్థులు

కోయిలకొండ మండలంలో..

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆదివారం 1990–91సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. పాఠశాలలో చదువు పూర్తి చేసుకొని 35 ఏళ్లు కావడంతో విద్యార్థులు ఒకరినొకరు పలుకరించుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

జడ్చర్ల పట్టణంలో..

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఆర్యసమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దయానంద విద్యామందిరంలో ఆదివారం 2007–08 ఏడాది పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వేద ఉపన్యాసాలు, భజనలు, కీర్తనలు, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. యజ్ఞం నిర్వహించి పూర్వ విద్యార్థులకు ఆశీర్వచనం చేశారు.


కోయిలకొండ: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1990-91 బ్యాచ్ విద్యార్థులు